# స్వప్న సుందరి

-రాణి




కుటుంబ బరువు బాధ్యతలను వదిలించుకునేసరికి ముప్ఫై ఏళ్ళు దాటాయి. కాలం తెచ్చిన నిరాసక్తతతో విరక్తితో కూడిన జీవితం గడుపుతున్న నాలో సుహాసిని ఆగమనం చిత్రమైన మార్పును తీసుకొచ్చింది.

నా ముప్ఫై రేండేళ్ళ బ్రహ్మచర్యానికి నీళ్ళు ఒదులుకునే సమయం ఆసన్నమయింది.

ఇంటి భారాన్నంతా నా ఒక్కడిమీదే వేసుకొని అదే త్యాగం అనుకుంటూ ఇన్నేళ్ళు నిరర్థకంగా గడిపిన నా అసమర్థతను, చేతకానితనాన్ని.. నన్ను నేనే నిందించుకున్నాను.

అసలు సిసలైన బ్రహ్మచారిగా బ్రతుకుతున్న నాలో.. పరిపూర్ణమైన స్త్రీత్వంతో మెరిసిపోతున్న సుహాసిని అలజడి రేపింది.

ఒకరోజు భాస్కరానికి హెల్త్ బాగోలేదని తెలిసి వాడింటికి వెళ్ళాను. సాధారణంగా ఫ్రెండ్స్ ఇళ్ళకు ఎప్పుడూ వెళ్ళను. ఏదైనా ఫంక్షన్స్ ఉంటే ఇక తప్పదన్నట్లు వెళతాను. మా మీటింగ్ ప్లేసెస్ ఎటూ ఉండనే వుంటాయి.

నేను వచ్చిన విషయం తెలుసుకొని వాడు బెడ్‌రూములో నుంచి వచ్చి హాల్లో కూర్చున్నాడు.

కుశల ప్రశ్నలు, పిచ్చాపాటి కబుర్లతో ఓ అరగంట గడిపాము. ఇంతలో బయటనుంచి వాళ్ళావిడ పిల్లలతో వచ్చింది. మర్యాదపూర్వకంగా లేచి నమస్కరించాను.

వచ్చి ఇంతసేపయినా టీలు, టిఫిన్లు వంటి మర్యాదలు జరగనందుకు నొచ్చుకుంటూ హడావుడిగా వంటింట్లోకి పరుగెత్తింది.

మరో పావుగంటలో పకోడి ప్లేట్లు, టీకప్పుల ట్రేతో వచ్చి నిలుచున్న ఆ అమ్మాయిని చూడటం తోటే నా శరీరంలో సన్నని ప్రకంపన మొదలయ్యింది.

యౌవనపు మిసమిసలతో మెరిసిపోతున్న ఆ అమ్మాయిని "చుట్టాలమ్మాయి, వరసకు చెల్లెలు అవుతుంది. పేరు సుహాసిని" అంటూ పరిచయం చేసిన భాస్కరం వంక మెచ్చుకోలుగా చూశాను.

హేమంత తుషారంలా పలకరించి వెళ్ళిపోతున్న ఆ అమ్మాయివైపే కళ్ళప్పగించి

చూడసాగాను సభ్యత కాదని తెలిసినా.

ఆమె అద్భుత సౌందర్యం అనుభూతు లందించే తొలకరి జల్లులా వుంది. ఓ అచేతనావస్థలో కూర్చుండిపోయిన నేను భాస్కరం పిలుపుతో ఉలిక్కిపడి ఓ పకోడి ముక్కను నోట్లో వేసుకుని నమలసాగాను.

ఆమె చేతిలోని టీకప్పు అందుకొనేటప్పుడు, ఆమెకు తెలియకుండానే తన చేతివేళ్ళు నాకు సున్నితంగా తగిలాయి.

తొలిచూపు, తొలిస్పర్శ, తొలి ప్రేమ, తొలి వలపు భావోద్రేకాల మధ్యన నలిగిపోతోంది.

ఇంటికి ఎలా వచ్చి చేరానో నాకే తెలియలేదు. ఏదో మాట్లాడబోయిన అమ్మమీద విరుచుకు పడ్డాను.

రాత్రంతా కిటికీ దగ్గర కూర్చుని నిశ్శబ్దంగా కురుస్తున్న వెన్నెలను చూడసాగాను. ఎంత మనోహరంగా వుంది! ఎప్పుడైనా చూస్తేగా..?

* * *

తరచు భాస్కరం ఇంటికి వెళ్ళసాగాను. నేను ఎవరికోసం వస్తున్నానో అర్థం చేసుకోలేనంత అమాయకుడేం కాదు.

ఒకరోజు డొంకతిరుగుడు లేకుండా సూటిగా పాయింట్‌లోకి వచ్చేశాను. ముందుగానే ఊహించి వుండటం వలన వాడేం ఆశ్చర్యపడలేదు.

"సుహాసిని గురించి ఏం తెలుసని పెళ్ళిప్రస్తావన తీసుకొచ్చావు?"

"తెలియనవసరం లేదు. కులగోత్రాల పట్టింపు ఏం లేదు నాకు. కట్నకానుకలు అవసరం లేదు. ఆమె నా సొంతమయితే అదే పదివేలు."

"ఏవిధంగా సొంతమవాలి? కన్యగానే కావాలా కాదంటే..!'

"అర్థం లేకుండా మాట్లాడుతున్నావు భాస్కర్!" విసుగ్గా అన్నాను.

"కాదు. పరిస్థితి అంతా నీకు అర్థమయ్యేలా చెప్పడానికి ప్రయత్నిస్తున్నాను. నువ్వు ఊహిస్తున్నట్లు సుహాసిని పెళ్ళికాని పిల్లకాదు."

"మరి?" చాలా టెన్షన్‌గా వుందనికి.

"ఆమెకు పెళ్ళయి మూడేళ్ళయింది." చాలా తాపీగా చెప్పాడామాట.

గుండెనెవరో రంపంతో కోసినట్లు విలవిలలాడిపోయాను. ఏడ్పు ముఖం పెట్టి చాలా దీనంగా అడిగాను.

"నువ్వు నన్ను ఆటపట్టిస్తున్నావు కదూ!" భోరుమనటానికి సిద్ధంగా ఉన్నాను.

"లేదు. ఆమెకు పెళ్ళయింది. బాబుకూడా వున్నాడు." చాలా కూల్‌గా చెబుతున్నాడు.

"మొగుడు కూడా ఉన్నాడా?" పళ్ళు కొరుకుతూ వ్యంగ్యంగా అడిగాను.

"బతికే వున్నాడు త్రాష్టుడు! దరిద్రుడు" అంటూ తిట్ల దండకం మొదలెట్టాడు.

## పగటి కలలు

అందనంత, ఎత్తునున్న, భౌతికానందాలను,
అందుకుందామని వున్నా, అందుకోలేక
పనికిరాని, పగటి కలలు కంటూ,
పండంటి జీవితాన్ని,
అడవిని గాచిన వెన్నెలగా, చేసుకోకు,
అందిన, నీ పరిసరాలలో, కృషి బీజాలు నాటి
బ్రతుకు పంట, పలసాయాన్నందుకో!
అడుగు తర్వాత, అడుగు వేసి,
నువ్వు, క్రమం తప్పక, నడుచుకుంటూ పోతే
ఎంతటి దూరమైనా, నీకాళ్ళ క్రింద
కార్పెట్టులా, పరుచుకుంటుంది!
నువ్వు ముందుకు వస్తే, కాలం చెయ్యందిస్తుంది!
మరి నువ్వు, పగటి కలలు కంటూ,
మందకొడిగా ఉంటే, తప్పక వెళ్ళిపోతుంది!
పగటి కలలు కంటూ నువ్వు కూర్చుంటే,
సగటు మనిషిగానే కాదు,
సగం మనిషిగా కూడా యెదగలేవు!

**- పులిచేరి రామమోహనరావు**

"పూజకు పనికిరాని పువ్వన్నమాట" విరక్తిగా అన్నాను.

"ఎందుకు పనికిరాదూ! నువ్వు అండగా నిలబడతానంటే వచ్చి నీ గుండెలపై వాలిపోదూ" చాలా తీయగా చెబుతున్నాడు.

"ఎందుకూ? గుదిబండలా మారడానికా! ఓ బిడ్డతల్లిని అందునా మొగుడు ఉన్నదాన్ని స్వీకరించే ధైర్యం నాకు లేదురా".

"ఎందుకు లేదురా? ఆమె అందానికి దాసోహమన్నావు. ఆమె సంస్కారానికి చలించానన్నావు. ప్రేమించానన్నావు.. పెళ్ళి చేసుకుంటానన్నావు" అంటూ వాడు నాకు బ్రెయిన్‌వాష్ చెయ్యటం మొదలెట్టాడు.

"నిజమే కాదనటం లేదే. సుహాసిని 'అమ్మాయి' అనుకున్నాను. 'అమ్మ' అనుకోలేదు. నువ్వు ఈ నిజం నాకు ముందుగానే ఎందుకు చెప్పలేదు. ఈ విషయం తెలిసీ నాకు చెప్పకపోవటం నీ తప్పుకాదా?" అంటూ వాడిమీద విరుచుకుపడ్డాను.

"చెప్పాలనిపించలేదు. తమరి విన్యాసాలన్నీ చూస్తూనే వున్నాను. పీకలదాకా ప్రేమలో కూరుకుపోయాక నిజం తెలుసుకున్నా వచ్చే ప్రమాదమేదీ లేదనుకున్నాను. పెళ్ళికి అభ్యంతరం పెట్టవనుకున్నాను."

"ఎలా అనుకున్నావు.. నన్ను చూసి ఫ్రెండ్స్ నవ్వుకోరూ! చేసుకోక చేసుకోక బిడ్డతల్లిని చేసుకున్నావంటూ హేళన చేయరూ! అసలు ఇంట్లోవాళ్ళు ఒప్పుకోరురా!"

"ఇంట్లోవాళ్ళు బోడి ఇంట్లోవాళ్ళు. ఎవర్రా నీకు అయినవాళ్ళు? మీ అమ్మా, నాన్నలా? నీ తోడబుట్టినవాళ్ళా? నీ చుట్టాలా?

"పదేళ్ళబట్టి గవర్నమెంటు ఉద్యోగం వెలగబెట్టున్నావు. నీకంటూ ఒక్క రూపాయి దాచుకోగలిగావా?

ఉన్నదంతా మీవాళ్ళకు దోచిపెట్టడమే సరిపోయింది కదరా. పెద్దకొడుకువంటూ లేని పెద్దరికాన్ని కట్టబెట్టి నీ సంపాదనంతా ఊడ్చుకు తిన్నారు".

నీకు పెళ్ళిచేస్తే ఎక్కడ వాళ్ళను నిర్లక్ష్యం చేస్తావోనన్న భయంతో ఇన్నేళ్ళు నీకు పెళ్ళి ప్రయత్నాలే చేయలేదు. ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకున్నారు. ఇటువంటివాళ్ళను చూసా నువ్వు భయపడుతున్నది!"

ఆవేశంగా అరుస్తున్న వాడి మాటలకు అడ్డుతగులుతూ "ఇంట్లోవాళ్ళ విషయం వదిలేయరా. భర్త చనిపోయిన ఆడదాన్ని చేసుకుంటే కనీసం జాలి, సానుభూతి అయినా మిగులుతాయి. ఓ వైపు భర్త, మరో వైపు బిడ్డ తలచుకుంటేనే భయమేస్తోందిరా," చాలా దీనంగా అన్నాను.

"వాళ్ళ డైవోర్సు కేసు, కోర్టులో నడుస్తోందిరా. ఇంకెంతకాలం! కొద్దిరోజులు ఓపికపట్టు. ఇక బిడ్డ సంగతంటావా.. ఆ పసిగుడ్డును తండ్రిగా స్వీకరించేటంత పాటి సహృదయం కూడా నీకు లేదంటావా?"

"బిడ్డసంగతి అటుంచు. ముందు తల్లి సంగతి ఆలోచిద్దాము. పెళ్ళి జరిగిన మూడేళ్ళకే వ్యవహారం చెడి విడాకుల వరకు వెళ్ళిందంటే తప్పు ఎవరిలో వుందంటావు?" సాలోచనగా వాడివైపే చూస్తూ అడిగాను.

"కాలికి వేస్తే మెడకి, మెడకి వేస్తే కాలికి వేస్తున్నావు కదరా! తప్పు ఆమెదీ కాదు, అతనిదీ కాదు. ఒకవిధంగా చూస్తే ఆమె అందానిది.

ఇరువైపు పెద్దలు అన్నివిధాలా ఇష్టపడి చేసిన వివాహమిది. పెళ్ళి చూపులలో సుహాసిని అందం చూసి ముగ్ధుడై ముచ్చటపడి చేసుకున్నాడు.

ఆమె అందం ఆమె పాలిట శత్రువు అవటం తన దురదృష్టం! భార్య అందాన్ని చూసుకుంటూ బాధపడేవాడు. తనతో పోల్చుకుంటూ గిల్టీగా ఫీలయ్యేవాడు.

ఆత్మన్యూనతతో బాధపడుతూ పడుతూ కొద్దిరోజులకు రాక్షసుడిలా మారాడు. శాడిస్టులా బిహేవ్ చెయ్యటం మొదలెట్టాడు.

ఆమెను ఇంట్లో పెట్టి బయట తాళం వేసుకొని వెళ్ళిపోయేవాడు. ఎవరితో మాట్లాడినా సహించలేకపోయేవాడు. ఆఖరుకి పుట్టింటికి రాకపోకలు కూడా నిషేధించాడు.

ఇటువంటి స్థితిలో ఆమె గర్భవతి కావటం అతనిలోని రాక్షసత్వాన్ని మరింత రెచ్చగొట్టినట్లయింది.

సూటిపోటి మాటలతో వేదించటం అనరాని మాటలతో అవమానించటం ఎదురుతిరిగితే

చితకబాదటం నిత్యకృత్యమైంది. పరిస్థితి విషమించటంతో విడాకులు తప్పనిసరి అయింది. ఇందులో ఆమె తప్పేమీ లేదు. తను మటుకు ఎంతకాలమని ఓర్చుకుని ఉంటుంది?"

"నిజమే వినటానికి చాలా బాధగానే వుంది. నేను మటుకు ఏం చేయగలను.. సగటు మనిషిని. ఆమెను స్వీకరించేటంత విశాలహృదయము లేదు. ఆదరించే ఔన్నత్యమూ లేదు. నా బలహీనతలు నాకు ఉన్నాయి.

ఆమెను ఒదులుకోవటానికి మనసు అంగీకరించటం లేదు. అలాగని చేసుకోవటానికి ధైర్యం చాలటం లేదు. నా బాధలు నావి. క్షమించి నన్ను వదలిపెట్టరా!" అంటూ నిజాయితీగా నాలోని లోపాలని నేను ఒప్పుకున్నాను.

* * *

హఠాత్తుగా ఒకరోజు చెప్పా పెట్టకుండా ప్రత్యక్షమయిన నన్ను చూసి తెగ ఆశ్చర్యపడిపోయాడు భాస్కరం.

"సడన్‌గా ఊడిపడ్డావేంట్రా!" అంటూనే సాదరంగా ఆహ్వానించాడు.

బ్యాగ్ లోపలి నుంచి ఓ కవరు తీసి వాడి చేతిలో పెట్టాను. ప్రశ్నార్థకంగా నావైపే చూస్తూ వాడు దాన్ని ఓపెన్ చేశాడు.

నేను ఊహించినట్లు వాడి ముఖంలో రంగులు మారలేదు. భావరహితంగా చూస్తూ "ఇంతకాలానికి ఓ ఇంటివాడివి కాబోతున్నావన్న మాట," అంటూ మృదువుగా నా చెయ్యి నొక్కాడు.

"పెళ్ళికి తప్పకుండా రావాలి. మన ఫ్రెండ్స్ అందరూ ఫ్యామిలీస్‌తో వస్తున్నారు. నువ్వుకూడా" అంటూ గిల్టీగా ఫీలవుతూ చూశాను.

"ముదురు పెళ్ళికొడుకువి. అందరికీ నీ పెళ్ళి చూడాలనే వుంటుంది మరి. ఇంతకీ పెళ్ళికూతురు ఎలా వుంటుంది? అందంగా వుందా? సుహాసినిలా ఉంటుందా?"

నా ముఖం నల్లగా మాడిపోయింది. అటు తిప్పి ఇటుతిప్పి టాపిక్ ఎటువైపు తీసుకెళ్తున్నాడో అర్థమవుతూనే వుంది.

వాడు అడిగినదానికి సమాధానం చెప్పకుండా తప్పించుకోవాలని చూశాను.

"పెళ్ళి బాగా గ్రాండ్‌గా చేస్తానన్నారు. 'మ్యూజికల్ నైట్ షో' కూడా ఆరేంజ్ చేస్తున్నారు" చాలా గొప్పగా చెప్పాను.

"కట్నం కూడా బాగా ఇస్తున్నారా?" వాడు అడిగినదానికి గర్వంగా తల ఎగరేశాను.

"ఇంతకీ అమ్మాయి గురించి చెప్పనేలేదు. అందంగా ఉందా.. నీకు నచ్చిందా!" వాడి గొంతులోని క్యూరియాసిటీ ఇట్టే పసిగట్టాను.

"అందంలో ఏముందిరా.. ఈరోజు వుంటుంది రేపు పోతుంది. మంచి ఫ్యామిలీ. మంచి మనసు. వేలెత్తి చూపలేని కేరెక్టరు. పైపెచ్చు బోలెడంత కట్నం!"

"చాలా సంతోషం! ఇంతకీ తమరి పెళ్ళికి సుహాసినిని తీసుకురావొచ్చునా! రాకూడదా!" పదాలను పెదాల మధ్య నొక్కిపెడుతూ అడుగుతున్న భాస్కరం వంక గుర్రుగా చూశాను.

"పదే పదే సుహాసిని ప్రస్తావన నావద్ద తీసుకురావొద్దు. రేపో మాపో పెళ్ళి చేసుకోబోతున్నవాడిని. ఒక పరాయిస్త్రీ అందులో వివాహితురాలైన ఓ బిడ్డతల్లి గురించి నా దగ్గర ఇలా మాట్లాడటం నాకు చాలా అసహ్యంగా అనిపిస్తోంది," అంటూ గంభీరంగా చిన్న సైజు ఉపన్యాసం ఇచ్చాను.

* * *

అంగ రంగ వైభవంగా పెళ్ళి జరిగిపోయింది. అనుకున్నవాళ్ళు అందరూ పెళ్ళికి వచ్చారు.. సుహాసిని తప్పించి.

పెళ్ళి వేడుకలు, పండగలు పబ్బాలు, సారెలు, విందు వినోదాలతో నా వైవాహిక జీవితం నెల దాటి రెండవ నెలలో అడుగుపెట్టింది.

మనసులో ఏదో వెలితి.. తెలియని అసంతృప్తి మహావృక్షంలా పెరగసాగింది. ఏదో కోల్పోయానన్న బాధ నిరంతరం నన్ను వేధించసాగింది.

ఇంట్లో ఉండబుద్ధికావటం లేదు. భార్య తెచ్చిన కట్నం తాలుకు డబ్బు బ్యాంక్ లాకర్‌లో కళ్ళకు నిండుగా కనబడుతున్నా. కంటిమీద కునుకే రావటం లేదు ఎందుచేతనో!

ఒంటినిండా నగలతో ఇంటికి సరిపడా ఫర్నిచర్‌తోవచ్చిన కోడలిలో, అమ్మ మహాలక్ష్మిని చూసుకోసాగింది.

అందరూ చాలా సంతోషంగా ఉన్నారు. ఒక్క నేను తప్ప!

పదేపదే ఆమె జ్ఞాపకాలు నన్ను వెన్నంటి రావటంతో, ఇక నిగ్రహించుకోవటం నాకు అసాధ్యమనిపిస్తోంది. ఆమెను చూడకుండా ఉండలేకపోతున్నాను.

నెమ్మదిగా భాస్కరం ఇంటికి వెళ్ళటం ప్రారంభించాను. ఎవరూ కాదనలేదు. వివాహితుడైన నన్ను ఎవరూ తప్పు పట్టలేక పోయారు. భాస్కరం సైతం నన్ను పట్టుకోలేనంత పెద్దమనిషిలా వ్యవహరించసాగాను.

కనువిందు చేస్తున్న అందాలతో కంటిగింపుగా కనబడుతున్న సుహాసినిని చూడకుండా ఉండగలనా! అందులోనూ నాలోని పురుషత్వాన్ని తట్టి లేపి, నాలోని నిద్రాణమైన కోర్కెలను రెచ్చగొట్టిన స్త్రీమూర్తిని మరువగలనా!

కళ్ళతోటే ఆమె అందాన్ని ఆస్వాదించి తృప్తిపడసాగాను. ఊహాలోకాల్లో నా స్వప్నసుందరితో విహరించి అంతులేని ఆనందాన్ని పొందసాగాను.

నేను చేస్తున్న పని తప్పని నా మనసు ఓ వైపు హెచ్చరిస్తున్నా కనులతోచూసి కలలలో విహరించటంలో తప్పేమీ లేదని మరోవైపు మనసుకు సర్ది చెప్పుకుంటున్నా.

నా రాకపోకల్ని అనుమానించనంత వరకు, నాలోని ఆలోచనలు పసిగట్టలేనంత వరకు నేనూ పెద్దమనిషినే! పెళ్ళయిన జంటిల్‌మేన్‌ని! *

## మీరు జీవన్ భీమా పాలసీ తీసుకుంటున్నారా?

పాలసీ తీసుకోవడం భవిష్యత్తులో ఉపయోగకరం అనే విషయం ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇది అందరికీ తెలిసిందే. అయితే పాలసీ తీసుకొనే ముందు కొన్ని విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి.........


* లాంగ్‌టర్మ్ పాలసీ తీసుకోవడం ఎక్కువ ఉపయోగకరం. ఎందుకంటే ఇందులో ప్రీమియం తక్కువ పడుతుంది.

* ప్రీమియంను సంవత్సరానికి ఒకసారి చెల్లించడం మంచిది. తరచూ ప్రీమియం చెల్లించాలన్న మానసిక ఆందోళన లేకుండా ఉంటుంది.

* పాలసీ ఎవరి పేరున తీసుకున్నా, నామినీస్‌ను మాత్రం ఎక్కువ మందిని పెట్టాలి. దీనివలన భవిష్యత్తులో రాబోయే న్యాయ సంబంధమైన సమస్యల నుంచి ఇబ్బందులు ఎదురవకుండా ఉంటాయి.

* పాలసీ ఫామ్‌ను పూరించే ముందు సరైన వివరాలను అందించాలి. అలాగే అందులో ఉండే అన్ని కాలమ్స్‌ను పూర్తిగా నింపాలి. లేకపోతే చిటికిమాటికీ సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది.

* యూనిట్ లింక్‌డ్ ఇన్ష్యూరెన్స్ తీసుకుంటే ఇది మార్కెట్‌తో అనుసంధానమై ఉంటుంది కాబట్టి రిటెన్స్ కూడా ఎక్కువగా వస్తాయి.



* పాలసీ తీసుకునే సమయంలో దాన్ని పూర్తిగా అర్థం చేసుకొని, భవిష్యత్తులో రాబోయే రిటన్స్ కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

- ఎన్.ఎల్.బి